పక్కా ఇళ్లకు రూ.ఐదు లక్షలివ్వాలి

- బిజెపికి వ్యతిరేకంగా పోరాటం మరింత ముమ్మరం
- నూతన గృహప్రవేశ కార్యక్రమంలో తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.మూడు లక్షలు సరిపోవని, రూ.ఐదు లక్షలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను విచ్చలవిడిగా అమ్మేస్తూ, మతోన్మాదాన్ని విస్తరింపచేస్తున్న బిజెపికి వ్యతిరేకంగా మున్ముందు పోరాటాలను మరింత ముమ్మరం చేయనున్నట్టు స్పష్టంచేశారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలకేంద్రంలో ఎనిమిది నెలల కిందట భూపోరాటం చేసి ఏర్పాటు చేసుకున్న సుందరయ్య కాలనీలో నూతన గృహాలను ఆయన ప్రారంభించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు బస్టాండ్ నుంచి సుందరయ్యనగర్ కాలనీ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. 1.20 ఎకరాల్లో 120 కుటుంబాలు గుడిసెలు వేసుకోగా, ఇందులో 90 కుటుంబాలు ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. భూ పోరాటం చేసి ఇళ్లు సాధించుకున్న స్థానికులకు తమ్మినేని అభినందనలు తెలిపారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతి కల్పించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఐక్యతను ప్రదర్శించారో అదే ఐక్యతను కొనసాగించాలని కోరారు. భూ పోరాటాన్ని కొనసాగిస్తూ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సాధించుకునేంతవరకూ మేం కొండంత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంలో సిఎం కెసిఆర్‌తో జరిగిన చర్చలో నాలుగేదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని చెప్పామని, అంతేకాకుండా పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. లేనిపక్షంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరామన్నారు. దేశంలో మతోన్మాదాన్ని విస్తరిస్తున్న బిజెపిని ఓడించడానికి వామపక్షాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న తమ్మినేని

బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేయాలంటే ఎర్రజెండా అవసరమని గుర్తించి సిఎం కెసిఆర్ వామపక్షాలతో పొత్తుకు ఆహ్వానించారని, అందుకే వారికి మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. మునుగోడులో ఐదు సార్లు వామపక్షాలు విజయం సాధించడంతో, ఓటు బ్యాంకు ఉండటంతోనే టిఆర్ఎస్ 10 వేల మెజార్టీతో విజయం సాధించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ కృతజ్ఞతలు తెలిపారని, వచ్చే ఎన్నికల్లోనూ పొత్తుతో పోటీ చేద్దామని ఆహ్వానించారని, ఎన్నికల సందర్భంలో మాట్లాడుకుందామని చెప్పామని వివరించారు. టిఆర్ఎస్ సానుకూలంగా ఉన్న క్రమంలో ప్రజా సమస్యలపై సిఎంతో చర్చించామన్నారు. పోడు భూములు పంపిణీ చేయాలని కోరామని, ఈ క్రమంలోనే సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఖమ్మం జిల్లాలో ఈ సర్వేపై క్షేత్రస్థాయిలో పరిశీలించామని, పలు లోపాలు తమ దృష్టికి వచ్చాయని, ఇచ్చిన హామీ మేరకు సమస్యలన్నింటినీ పరిష్కరించి సిఎం నిలబెట్టుకోవాలని కోరారు.

స్థానిక నాయకత్వం బలపడాలి : పోతినేని సుదర్శన్‌రావు

ఎనిమిది నెలలుగా భూ పోరాటం చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్న నేపథ్యంలో స్థానిక నాయకత్వం మరింత బలపడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి ఇండ్లను నిర్మించుకున్న మీరందరూ అభినందనీయులన్నారు. పేదలు చేస్తున్న భూ పోరాటంలో భాగంగా హన్మకొండ కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొనడానికి వస్తుండగా రాయపర్తిలో తనని, తమ్మినేనిని పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. మమ్మల్ని అరెస్ట్ చేస్తే ధర్నా నిలిచిపోతుందనుకున్నారని, కానీ మీరంతా పట్టుదలతో ధర్నా చేయడంతోనే భూపోరాటం విజయవంతం అయిందని తెలిపారు. పేదలు చేస్తున్న భూపోరాటంపై నిర్బంధంతో వరంగల్ పోలీసు కమిషనర్, డిజిపిని కలిశామని, పేదలు గుడిసెలు వేసుకుంటే పోలీసుల సహకారంతో రౌడీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దౌర్జన్యంగా పీకేయడమేంటని ప్రశ్నించామని తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేస్తే వూరుకోమని హెచ్చరించామన్నారు. ఎక్కడ భూ పోరాటం చేశామో అక్కడే ఇండ్లు కట్టి తీరుతామని స్పష్టంచేశారు. ఇక నుంచి ఇది నాగుల చెరువు కాదని, పేద ప్రజల ప్రియతమ నాయకుడు సుందరయ్య నగర్ కాలనీగా కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 29న ఖమ్మంకు కేరళ సిఎం పినరయి విజయన్ వస్తున్నారని, అక్కడ జరిగే సభకు మీరందరూ వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సిఎం విజయన్ కేరళలో ఒక్కొక్క పేద కుటుంబానికి రూ.ఆరు లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. అలాంటి ఆదర్శవంతమైన పాలన మనకు రావాలన్నారు.

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ.. భూ పోరాటం ప్రారంభించే సమయంలో ఎంతో భయంతో ఉన్నారని, ఎన్నో అడ్డంకులు, బెదిరింపులను అధిగమించి నేడు ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇదే ధైర్యం, ఐక్యతతో ముందుకు సాగితే మరిన్ని సమస్యలను పరిష్కరించుకోవడమే కాకుండా, కాలనీలో ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సభలో రైతుసంఘం నాయకులు ఎం చుక్కయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు, గొడుగు వెంకట్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు భానూనాయక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి పాల్గొన్నారు.

మియాపూర్‌లో ఐషర్ అత్యాధునిక డీలర్‌షిప్ ఏర్పాటు

ప్రజాశక్తి-హైదరాబాద్

పశ్చిమ తెలంగాణాలో ఐషర్ ట్రక్, బస్సు వినియోగదారులకు సేవలనందించేందుకు మియాపూర్‌లో అత్యాధునిక డీలర్‌షిప్ ఏర్పాటు చేసినట్లు ఐషర్ తెలిపింది. దాదాపు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రంలో బహుళ సర్వీస్ బే లు ఉన్నాయి. ఇక్కడ విడిభాగాలు, సేవా ఉపకరణాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటంతో పాటుగా ఐషర్ వినియోగదారులకు మెరుగైన సేవలు లభ్యమవుతాయని విఇసివి ఎస్‌విపి కస్టమర్ సర్వీసెస్, నెట్ వర్క్ స్ట్రాటజీ రమేష్ రాజగోపాలన్ తెలిపారు.

ధరణి పోర్టల్‌లో సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు చాడ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణి పోర్టల్‌లోని సమస్యలతోపాటు లొసుగులను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సర్వే నెంబర్ల వారీగా డిజిటల్ సర్వే చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. సాదాబైనామాలకు ధరణి పోర్టల్‌లో ఆప్షన్ ఇవ్వాలని తెలిపారు. మీసేవలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. గతంలో పట్టాపై ఆధార్‌కార్డులాంటివి అనుసంధానం కాకపోవడం, సంబంధిత సాంకేతిక సమస్యల వల్ల సన్న, చిన్న, నిరుపేద రైతులు వాస్తవసాగుదార్లు రైతుబీమా, రైతుబంధు తీసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని సరిచేయాలని తెలిపారు. భూప్రక్షాళన కార్యక్రమంలో వాస్తవ పట్టాదారులకు బదులుగా ఇతర వ్యక్తుల పేర్లు పట్టాదార్లుగా నమోదయ్యాయని వివరించారు. వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని ధరణిలో ఒరిజినల్ పట్టాదార్ల పేర్లను నమోదు చేయాలని కోరారు.

CAUTION NOTICE

The general public are hereby informed that, my client Sri. Anil Tiwari S/o. Vishnu Gopal Tiwari, R/o. H.No. 14-2- 179 /2, Gyan Bagh Colony, Begum Bazar, Hyderabad-500 012. entered into agreement of sale in respect of below mentioned schedule property with its owner Mr. Mohammed Sadiq, S/o. Mohammed Sabir, H.No. 11-5-1/103, Mukkaram Plaza, Bazarghat, Red Hills, Hyderabad-500 001, and my client also paid considerable sale consideration amount to him.

That recently my client came to know that the said Mohammed Sadiq in collusion with his sister namely Mrs. Sameena Praveen @ Afshan Fatima W/o. Yousuf Mujahid, created a registered Settlement Deed bearing document No. 8343 of 2017 in respect of the schedule property to defeat the rights of my client based on the agreement of sale dated: 27-7-2015 and supplementary agreement of sale dated: 25-5-2019.

That the said agreement of sale executed by the said Mohammed Sadiq is subsisting and the said regd. Settlement Deed obtained by the said Mrs. Sameena Praveen @ Afshan Fatima is invalid and void document and the same was obtained without transfer of physical possession of the schedule property. In this regard, my client already got issued legal notice to said persons and also taking legal measures against them.

Hence, the general public are hereby cautioned not to purchase or enter into any sort of agreements or contracts with the Mohammed Sadiq and Mrs. Sameena Praveen Afshan Fatima in respect of the schedule property, inspite of this publication, if any person or persons doing so, then those transactions shall be treated as null and void and not binding against my client and on the schedule property.

SCHEDULE OF PROPERTY

All that the agricultural land in **Survey No. 191/AA,** Admeasuring Ac. 3-00 guntas, situated at **CHILKAMARRY VILLAGE,** Farooq Nagar Mandal, Ranga Reddy District, T.S.

bounded by: -
NORTH : Land in Sy.No. 194
SOUTH : Land in Sy.No. 191/E
EAST : Land in Sy.No. 191/A
WEST: N.R.S.A. Road

Sd/- M/S. G. SUDHAKAR REDDY
Advocate
Plot No. 131, Sai Ram Nagar Colony, Champapet, Hyderabad Pin : 500-079
Ph. 9848470673 (M)

అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులు

స్పోర్ట్ మోడల్ స్కూల్లో ఫుడ్ పాయిజన్

- పలువురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని గిరిజన స్పోర్ట్స్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. గిరిజన స్పోర్ట్స్ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆదివారం చికెన్‌తో భోజనం పెట్టారు. భోజనం చేసిన విద్యార్థులకు సాయంత్రం నుంచి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌లకు చెప్పడంతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులకు హాస్టల్లో ఉన్న మాత్రలు ఇచ్చారు. సోమవారం సైతం ఇదే పరిస్థితి ఏర్పడడంతో ఈ విషయాన్ని అధికారులు బయటికి పొక్కనివ్వలేదు. మరుసటిరోజు మంగళవారం విద్యార్థులకు విరేచనాలు ఎక్కువకావడంతో హుటాహుటిన ఉపాధ్యాయులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క స్పందించారు. కలెక్టర్, అధికారులు, వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాలకు చేరుకుని ఫుడ్ పాయిజన్‌కు కారణాలు, అక్కడి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. .

వృద్ధుడికి పదేళ్ల జైలు శిక్ష

- ట్యూషన్‌కు వచ్చే బాలునిపై లైంగికదాడి కేసులో..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్యూషన్‌కు వచ్చిన బాలునిపై లైంగికదాడి చేసిన ఓ వృద్ధునికి 10 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు ఎల్‌బీనగర్ కోర్టు తీర్పునిచ్చింది. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్‌భగవత్ మంగళవారం వివరాలు వెల్లడించారు. సరూర్‌నగర్‌లో రవీందర్ ప్రకాష్ నాయర్ అనే వృద్ధుడు పిల్లలకు ట్యూషన్ చెబుతూ ప్రయివేటు టీచర్‌గా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఓ బాలుడు నాయర్ వద్ద ట్యూషన్‌కు వెళ్లేవాడు. అతనిపై నాయక్ లైంగికదాడి చేసేవాడు. రోజురోజుకూ నాయర్ వేధింపులు అధికం కావడంతో బాలుడు విషయాన్ని ఇంట్లో చెప్పాడు. దాంతో బాలుని తల్లిదండ్రులు 2018 జూన్ 2న సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ ఎన్‌సిహెచ్ రంగస్వామీ అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు విచారణ ఎల్బీనగర్ కోర్టులో కొనసాగింది. మంగళవారం నిందితునికి 10ఏళ్ల జైలు శిక్ష, రూ.45వేలు జరిమానా విధించారు.

అధికారిపై దాడిచేసిన ఎమ్మెల్యేను శిక్షించాలి

- యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జోతిరావు పూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (ఇన్ చార్జి) ఆర్‌సిఒ, నాగర్ కర్నూల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డిపై గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి దౌర్జన్యం చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్ కుమార్, ఎం రవీందర్, ఎం సోమయ్య, టి.లింగారెడ్డి, యు.పోచయ్య, డి.సైదులు, షౌకత్ అలీ, రాజయ్య, జాడి రాజన్న, మేడి చరణ్ దాస్, కొమ్ము రమేష్, ఎన్ యాదగిరి, ఎస్ హరికృష్ణ, వి శ్రీను నాయక్, జాదవ్ వెంకట్రావు, డి రాజనర్సుబాబు, వై విజయకుమార్, టి విజయసాగర్, శాగ కైలాసం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అధికారిపై దౌర్జన్యం చేసి, దుర్భాషలాడిన ఆ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎంజెపి టిఎస్‌యుటిఎఫ్ ఖండన

వెంకటరెడ్డిపై గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి దౌర్జన్యం చేయడాన్ని టిఎస్‌యుటిఎఫ్ ఎంజెపి గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎంజెపి టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ కన్వీనర్ ఎస్ సృజన, కో-కన్వీనర్ టి.లివిన్‌స్టన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారిపై చొక్కా పట్టుకుని భౌతిక దాడికి దిగటంతోపాటు రాయలేని భాషలో దుర్భాషలాడిన ఆ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి క్రికెట్ జట్టులో శ్రీచైతన్య విద్యార్థి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీచైతన్య స్కూల్ ఈస్ట్ మారేడ్‌పల్లి బ్రాంచి (మెహిదీపట్నం జోన్) నుంచి గొంగడి త్రిష జాతీయ స్థాయిలో అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపికైంది. ఈ నెల 27న ప్రారంభమయ్యే సిరీస్‌లో ఆమె ఆడనుంది. యాజమాన్యం సహాయంతో ప్రతిరోజూ ప్రాక్టీస్‌కు అనుమతి తీసుకుని పట్టుదలతో అటు క్రికెట్‌ను, ఇటు చదువును కొనసాగించారు. పదో తరగతిలో 10కి పది జిపిఎ సాధించారు. ఆమె ఎనిమిదేండ్ల వయస్సులోనే జిల్లాస్థాయి అండర్-16 జట్టులో ఆడారు. ఆపైన 12 ఏండ్ల వయస్సులో అండర్-19 తెలంగాణ జట్లుకు ఎంపికయ్యారు. కళాశాల చదువును కొనసాగిస్తూనే బిసిసిఐ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నారు. త్రిష ప్రధానంగా లెగ్ స్పిన్నర్‌గానే కాకుండా బ్యాటింగ్‌లోనూ తన ప్రతిభను కనబరిచి ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

గుత్తికోయల దాడిలో ఫారెస్ట్ అధికారి మృతి

- ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం
- మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా
- కుటుంబలో ఒకరికి ఉద్యోగం
- ఘటనపై విచారణకు డిజిపికి ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్లాంటేషన్‌లో పశువులు మేపొద్దని చెప్పినందుకు ఆగ్రహంతో ఫారెస్ట్ రేంజర్‌పై గుత్తి కోయలు మంగళవారం వేట కొడవలితో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడ్డ రేంజర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సెక్షన్ ఆఫీసర్ రామారావు కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు శివారు గ్రామంలోని ఎర్రబోడులో అటవీ శాఖ అధికారులు నాటిన ప్లాంటేషన్లను పరిశీలించేందుకు ఫారెస్టు రేంజర్ చలమల శ్రీనివాసరావు (45), సెక్షన్ ఆఫీసర్ రామారావు మోటర్ సైకిల్‌పై వెళ్లారు. ఒక ప్లాంటేషన్‌లో 30 మంది కూలీలకు మొక్కల పెంపకంపై డెమో ఇచ్చి తిరిగి చంద్రుగొండకు బయలుదేరారు. ఆ సమయంలో ఎర్రబోడు వద్దగల ప్లాంటేషన్‌లో మొక్కలను గుత్తికోయలు పశువులతో మేపుతున్నారని, వద్దని చెప్తే కొట్టడానికి వస్తున్నారని వాచర్ రేంజర్‌కి ఫోన్ చేసి చెప్పారు. సెక్షన్ ఆఫీసర్‌తో కలిసి రేంజర్ ప్లాంటేషన్ వద్దకు వెళ్లారు. ప్లాంటేషన్‌లో మేస్తున్న పశువులను సెక్షన్ ఆఫీసర్, వాచర్లు బయటికి కొడుతుండగా రేంజర్ వీడియో తీస్తూ నిలబడ్డారు. ఆ సమయంలో వెనక నుంచి వచ్చిన కొందరు గొత్తికోయలు (వలస ఆదివాసీలు) కత్తితో మెడపై దాడి చేయగా రేంజరు కేకలు వేస్తూ కిందపడిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న రేంజర్‌ను ప్రత్యేక కారులో చంద్రుగొండ పిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వర బాబు, జూలూరుపాడు సీఐ వసంత కుమార్, ఎస్ఐ విజయలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనతో చంద్రుగొండలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిందితులు పరారీలో ఉన్నట్టు సమాచారం.

ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తికోయల దాడిలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిందితులకు శిక్షలు పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిజిపి మహేందర్‌రెడ్డిని ఆదేశించారు. మరణించిన ఎఫ్‌ఆర్‌ఓ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఆయన కుటుంబానికి పూర్తి వేతనం అందించాలని, రిటైర్‌మెంట్ వయస్సు వరకు వారి కుటుంబ సభ్యులకు ఈ వేతనం అందచేసేలా చర్యలు తీసుకోవాలని, కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించారు. ఎఫ్‌ఆర్‌ఓ మృతదేహానికి ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సిఎస్ సోమేశ్‌కుమార్‌ను సిఎం ఆదేశించారు. అటవీశాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎఫ్‌ఆర్‌ఓలు అంత్యక్రియల్లో పాల్గొని సంబంధిత ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవాలని సిఎం ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు. కాగా, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

రేంజర్ శ్రీనివాసరావు హత్యను ఖండిస్తున్నాం - సిపిఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలంలో ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావును హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కమిటీ ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని ప్రకటించారు. హత్య చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: SECUNDERABAD

O.S. No. 938 OF 2022

BETWEEN:
Sri Yenna Venkateshwar Rao and Another ....Plaintiffs
AND
Smt Sura Padma Sudha and Others ...Defendants

To,
All Concerned. ....Defendant No.3

Sir's,
Please take the notice that the above plaintiffs filed above suit for declaration to declare the Plaintiffs and Defendant No.1 as the legal heirs of the deceased Sri Yenna Pandurangam and Smt Darapureddy Sujatha Devi. When the matter came up for the consideration the Hon'ble Court was pleased to direct the Plaintiffs to issue service of notice through Paper Publication to you and posted the matter for appearance on **29.12.2022** at **10.30 A.M.** before the above Court either in person or through your Counsel. If none of the parties appear on the above date on the above court the matter will be heard as per law.

(By order of the Court)
K.Nitesh, K Ankit Raj
Advocates
#135, The Neighbhourhood, Gundlapochampally, Medchal Malkajgiri, Telangana State
Mob & Wa: 9885382222.

రాజకీయ లబ్ధికోసమే పిఎం కిసాన్ పథకం

- రైతులను మోసం చేస్తోంది
- కేంద్ర బిజెపి సర్కారుపై పల్లా విమర్శలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసమే పిఎం కిసాన్ పథకాన్ని తెచ్చిందని రైతు బంధు సమితి చైర్మెన్, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అందుకే క్రమంగా లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోందని చెప్పారు. తద్వారా ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతులకు కేంద్రం ఏ ఒక్క మంచి పని చేయలేదని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీ ఆవరణలోని టిఆర్ఎస్ఎల్‌పి రాష్ట్ర కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి పల్లా విలేకర్లతో మాట్లాడారు. మొదట పిఎం కిసాన్ లబ్దిదారుల సంఖ్యను 11.5 కోట్లుగా గుర్తించిందన్నారు. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లో ఏకంగా 99 శాతం, ఛత్తీస్‌ఘడ్‌లో 94 శాతం మందిని తగ్గించిందని విమర్శించారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మహారాష్ట్రలో గత ఆరునెలల్లో 1,800 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. మోడీకి లేఖలు రాసి మరీ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సాగు చట్టాల రద్దు చేసి రైతులకు క్షమాపణ చెప్పిన మోడీ అప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కనీస మద్దతుల ధర కమిటీలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారినే నియమించారనీ, వారికి రైతు సమస్యలపై అవగాహన లేదని విమర్శించారు. రైతు పోరాట సమయంలో మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అందుకే మరో పోరాటానికి రైతులు సిద్ధమవుతున్నారని కేంద్రాన్ని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆందోళనలకు టిఆర్ఎస్ మద్దతు ఉంటుందన్నారు.

హుస్నాబాద్‌లో నాటుబాంబుల కలకలం

- బస్టాండ్‌లో పేలిన బాంబు
- కార్మికునికి తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన హుస్నాబాద్‌లో నాటు బాంబులు కలకలం రేపాయి. హుస్నాబాద్ బస్టాండ్‌లో మంగళవారం ఉదయం బాంబు పేలడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. పార్సిళ్లు తీసుకెళ్లేందుకు వచ్చిన తోపుడుబండి తాకడంతో ఒక్కసారిగా బాంబు పేలింది. బాంబు పేలినట్టు గుర్తించిన ఆర్‌టిసి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఎసిపి వాసాల సతీశ్ ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగి బాంబుస్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఐదు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఈ నాటు బాంబులు ఇక్కడికి ఎలా వచ్చాయని ఆరా తీస్తున్నారు. బస్టాండ్‌లోని సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. వారం రోజుల కిందట కూడా ఒక బాంబు పేలిందని ఆర్‌టిసి సిబ్బంది చెబుతున్నారు. బస్టాండ్‌లో దొరికిన నాటుబాంబులు అడవి పందులను చంపేందుకు ఉపయోగిస్తారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో అడవి పందులతో పాటు ఊరపందులను ఇలాంటి బాంబులతోనే చంపుతారంటున్నారు. బాంబులను బస్టాండ్‌లో ఎందుకు పడేశారనే అనుమానాలు వస్తున్నాయి. హుస్నాబాద్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నప్పుడు పట్టుబడతామేమోననే భయంతోనే ఎవరో బస్టాండ్‌లోని నిర్జన ప్రదేశంలో బాంబులను పడేసి ఉంటారని భావిస్తున్నారు.

ఆర్‌టిసిని పరిరక్షించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదే..

- కార్మిక సంఘాలను పునరుద్ధరించాలి
- ఇయు రాష్ట్ర కౌన్సిల్‌లో కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసిని పరిరక్షించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కెసిఆర్‌పైనే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్మిక సంఘాల కార్యకలాపాలకు అనుమతించాలనీ, బకాయి ఉన్న పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో సిఎం కెసిఆర్ పోరాడుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆయనపైనే టిఎస్‌ఆర్‌టిసిని కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నదని స్పష్టం చేశారు. మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా సిపిఐ మద్దతు కోరినప్పుడు ఇదే అంశాన్ని స్పష్టం చేశామనీ, అందుకు ఆయన అంగీకరించారని చెప్పారు. ఇప్పటికే సగం డిమాండ్ పరిష్కరించారనీ, మిగతా సగం కూడా పరిష్కారమవుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. వాటిలో ముఖ్యమైనవి ఆర్‌టిసిలో కార్మిక సంఘాల కార్యకలాపాలను అనుమతించడం, రెండుసార్లు బకాయి ఉన్న పిఆర్‌సి అమలు చేయాలని కోరారు. ఆర్‌టిసిలో ఎన్ని సంఘాల ఉన్నప్పటికీ సంస్థను, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతోంది ఎంప్లాయీస్ యూనియన్ మాత్రమేనని స్పష్టం చేశారు. గతేడాది యూనియన్ నాయకుడు రాజిరెడ్డిని యాజమాన్యం సస్పెండ్ చేయాలని చూస్తే తామంతా అండగా నిలిచామన్నారు. ఆర్టీసీతో కమ్యూనిస్టు పార్టీది పేగు బంధమనీ, కార్మికుల సమస్యలు, హక్కులు, పోరాటాలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్ బోస్, అధ్యక్షులు ఎస్.బాబు, కె.రాజిరెడ్డి, పద్మాకర్ తదితరులు ప్రసంగించారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 60/2019
(Old GDV E.P. No. 50/2017)
O.S. No. 1873/2014 of VII Addl. SCJC:VJA

Between:
మన్యం కనకవల్లి భర్త నారాయణ ప్రసాద్, నివాసం: ఫ్లాట్ నం. 2-ఎ, 4వ అంతస్తు, రామచంద్ర కాంప్లెక్స్, పెద్దిబోట్ల వారి వీధి, గవర్నరు పేట, విజయవాడ. ...Decree Holder

and

1. పమ్మి పద్మావతి (died)
2. దేవరకొండ శ్రావణి తల్లి పమ్మి పద్మావతి, పంప్లాయి, కేరాఫ్ పమ్మి ప్రత్యూష, డెంటల్ డాక్టర్, కిమ్స్ హాస్పిటల్, మినిస్టర్స్ రోడ్డు, సికింద్రాబాద్ మరియు ప్రస్తుత నివాసం: 54-19-57E/201, ఫ్లాట్ నం. 302, ఎల్.ఐ.సి. కాలనీ, జె.పి.నగర్, సాయి నిలయ అపార్ట్‌మెంట్స్, విజయవాడ-520008. ...Jedgement Debtors

వేలం తేది: 19.12.2022

పై నంబరు దావాలో పాస్ కాబడిన డిక్రి బాకిని రాబట్టుకొనుటకై, సదరు డిక్రి బాకి మరియు ఖర్చులు వగైరాలపై 2వ JDR నుండి వసూలు చేసుకొనుటకై E.P. No. 50/2017ను గౌ॥ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గుడివాడ వారి కోర్టులో దాఖలు కాబడి తదుపరి గౌ॥ గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టుకు ట్రాన్స్‌ఫర్ అయి ప్రస్తుతం E.P. No. 60/2019 నంబరుగా కాబడి పై డిక్రి బాకి క్రింద 2వ JDR తాలూకు క్రింద పేర్కొన్న వేలం కావాలసియున్న స్థిరాస్థి వివరము

షెడ్యూలు:

కృష్ణా జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, కొండపావులూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కొండపావులూరు గ్రామ తాలూకు గ్రామ రీ.సర్వే నం. 323/4 రు దాఖలా 0.65 సెంట్లు, రీ. సర్వే నం. 323/1 రు దాఖలా 0.42 సెంట్లు, వెరిశి ఎ. 1.07 సెంట్లు లేక 5175.88 చ.గ.లు ప్లాట్ నెం. 37 దాఖలా 311.11లలో ఉత్తరం వైపు 200 చ.గ.ల స్థిరాస్తి శేరి మెరక భూమికి హద్దులు:
తూర్పు: ప్లాన్ దాఖలా 20 అడుగుల వెడల్పు రోడ్డు, 45-0 అడుగులు
దక్షిణం: ప్లాట్ దాఖలా ప్లాట్ నం. 37 రు దాఖలా భాగం ఆస్తి, 40-0 అడుగులు
పడమర: ఇతరుల ఆస్తి, 45-00 అడుగులు.
ఉత్తరం: ప్లాన్ దాఖలా 20 అడుగుల వెడల్పు రోడ్డు, 40-0 అడుగులు.
పై నాలుగు హద్దుల మధ్య 200 చ.గ.లు లేక చ॥మీ॥ల 167.226 ర్లు శేరి మెరక భూమి స్థలం అందలి యూజ్‌మెంట్ హక్కులతో సహా.

షెడ్యూలు ఆస్తి గల గన్నవరం ఎస్ఆర్ఓ నుండి షెడ్యూలు ఆస్తికి E.C. తేది: 01.01.1991 నుండి తేది: 18.12.2020 వరకు తీసుకొనగా E.C.లో 7 ఎంట్రీలు కలవు. 1వ ఎంట్రీ ప్రకారం చనిపోయిన 1వ JDR తేది: 03.05.2011న సరేపల్లి శ్రీనివాసరావు & ఇతరుల వద్ద ప్రస్తుత E.P.పై షెడ్యూలు ఆస్తిని క్రయదస్తావేజు నం. 3324/2011 ద్వారా కొనుగోలు చేసి, ఆమె తదనంతరము ఆమె కుమార్తె, 2వ JDR యొక్క స్వాధీన హక్కు భుక్తములలో ఉండియున్నది. సదరు షెడ్యూలు ఆస్తిపై ఎటువంటి తదుపరి లావాదేవీలు ఉండి యుండలేదు. కావున వేలమునకు ఆక్షేపణలు ఏమియులేవు.

D.H.R. విలువ రూ. 2,00,000/-లు అమ్మిన (F.A.) విలువ: రూ. 4,70,000/-లు. కావున పై పేర్కొన్న 2వ JDR తాలూకు E.P. షెడ్యూలు ఆస్తిని ఎవరైన పాడుకోన దలచినది తేది: 19.12.2022వ తేదీన ఉ. 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై సదరు E.P.లో శ్రీ కోర్టు వారి నియమనిబంధనలకు లోబడి, సదరు పై కోర్టు వారు నిర్వహించు వేలములో పాల్గొని పాట పాడు కొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులనుసరించి)

గన్నవరం
19.11.2022

(D. Badari Nadh)
Advocate
Gannavaram, Krishna District-521101, A.P. Cell: 9440778676

ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

టిహబ్‌లో ఐబిసి కాంటినమ్

ప్రజాశక్తి-హైదరాబాద్

నగరంలోని టి హబ్‌లో ఐఇబిసి కాంటినమ్ అండ్ వెబ్ 3.0 హ్యాక్‌ఫెస్ట్ ఛాలెంజ్‌ను ఏర్పాటు చేసినట్లు ఐబిసి మీడియా తెలిపింది. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, టిహబ్ సిఇఒ శ్రీనివాసరావు మహంకాళి, ఐబిసి మీడియా ఫౌండర్, సిఇఒ అభిషేక్ పిట్టీ మంగళవారం లాంచనంగా ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ఉన్న నైపుణ్యవంతులు, విద్యార్థుల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు అభిషేక్ తెలిపారు. అదే విధంగా ఐబిసి ఎజెండాకు హెడ్‌లైన్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోన్న పోల్కాడాట్ మద్దతుతో ఇంటర్నేషనల్ బ్లాక్ చైన్ కాంగ్రెస్ ఐబిసి 2.0 రెండవ ఎడిషన్ కూడా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. దీనిని ప్రత్యేకంగా వెబ్ 2.0 సామర్థ్యం నుంచి ఇంజినీరింగ్ స్టూడెంట్ కమ్యూనిటీ వెబ్ 3.0 ఇండస్ట్రీ రెడీ డెవలపర్స్‌గా మారడానికి ఇది తోడ్పడుతుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

బిఎస్‌పిలో మహిళలకు అవకాశం

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహుజన్ సమాజ్ పార్టీలో మహిళలకు అత్యంత గౌరవం ఇస్తున్నదనీ, టిఆర్ఎస్‌లో వారికి అలాంటి గౌరవం లేదని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల్లో మహిళా కార్యకర్తలు గొప్పగా పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా నాయకత్వాన్ని నిర్మించాలని సూచించారు. మహిళలకు సంపూర్ణ అధికారాలు ఇచ్చే ఏకైక పార్టీ బిఎస్‌పి అని తెలిపారు. సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, మాయావతి వంటి మహనీయుల బాటలో నడిచి బహుజన రాజ్యం సాధించాలన్నారు.

పెన్షన్లు పునరుద్ధరించాలి

- పిసిసి చీఫ్ రేవంత్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్ మాటలు కోటలు దాటుతాయనీ, చేతలతో వాతలు పెడతారని పిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి మంగళవారం ట్వీట్ చేశారు. లక్షమంది అవ్వలు, తాతల పెన్షన్లకు కోత విధించడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. సిఎం జోక్యం చేసుకుని ఆ పెన్షన్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

రైతు సమస్యలపై దశలవారీగా ఉద్యమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ, రైతు సమస్యలపై దశల వారీగా ఉద్యమాలు నిర్వహించాలని పిసిసి నిర్ణయించింది. అందుకోసం జిల్లా కో-ఆర్డినేటర్లను నియమించింది. మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, ఏఐసిసి కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్సీలను పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నియమించారు.

పదవులకే వన్నె తెచ్చారు

- మాజీ సిఎం రోశయ్యకు భట్టి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య పదవులకే వన్నె తెచ్చారని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రోశయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి ఎమ్మెల్యే దూదిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

గ్లోబల్ గిఫ్ట్ ఫౌండేషన్‌లోకి సుధారెడ్డి

హైదరాబాద్ : పారిస్‌లోని స్టార్ స్టడెడ్ ఫోర్ సీజన్స్ జార్జ్ హోటల్‌లో గ్లోబల్ గిఫ్ట్ ఫౌండేషన్ ది గ్లోబల్ గిఫ్ట్ గాలా ప్యారిస్ ఎడిషన్ దశాబ్దాన్ని జరుపుకుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భారత్ నుంచి హైదరాబాద్‌లోని ఎంఇఐఎల్ గ్రూప్‌నకు చెందిన బిలియనీర్ పరోపకారి సుధారెడ్డి పాల్గొన్నారు.

గ్లోబల్ గిఫ్ట్ గాలా నుండి మెట్ గాలా, ప్యారిస్ కోచర్ వీక్, ఫస్ట్ లేడీస్ లంచ్ వరకు సుధా రెడ్డి తన ప్రత్యేకమైన రెడ్ కార్పెట్ ప్రదర్శనలతో తనదైన ముద్ర వేశారు.

మంత్రి మల్లారెడ్డికి ఐటి షాక్

- ఆయన ఇల్లు, కార్యాలయాలపై ఐటి దాడులు
- అల్లుడు, వియ్యంకుడు, బంధువుల నివాసాల్లోనూ సోదాలు
- భారీగా నగదు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఇంట్లో మంగళవారం ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 50 బృందాలుగా ఐటి అధికారులు మంత్రి మల్లారెడ్డి నివాసం, కార్యాలయాలతోపాటు బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు చేశారు. మంత్రి సోదరుడు గోపాల్ రెడ్డి, కుమారులు డాక్టర్ భద్రారెడ్డి, మహేందర్ రెడ్డి ఇళ్లతో పాటు పలువురు సమీప బంధువుల ఇళ్లలోనూ ఐటి అధికారులు సోదాలు జరిపారు. సుచిత్రలో నివాసం ఉంటున్న మంత్రి సమీప బంధువు త్రిశూల్‌రెడ్డి ఇంట్లో రూ.రెండు కోట్లను సీజ్ చేశారు. త్రిశూల్ రెడ్డి మంత్రి కాలేజీల బాధ్యతల్లో ఉన్నారు. ఉదయం నుంచి ఆయన ఇంట్లోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి కుమారుడికి సన్నిహితుడైన రఘునాథ్‌రెడ్డి ఇంట్లో రూ.రెండు కోట్లను స్వాధీనం చేసుకున్నారు. మంత్రి మల్లారెడ్డి ఇంట్లో సోదాలు జరుగుతుండటంతో ఆ ప్రాంతంలో ఎవరినీ రానీయకుండా సెంట్రల్ పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు.



మంత్రి సెల్‌ఫోన్ స్వాధీనం..

ఉదయమే మంత్రి మల్లారెడ్డి నివాసం, కార్యాలయాలకు బృందాలుగా చేరుకున్న ఐటీ అధికారులు మంత్రి సెల్‌ఫోన్‌తోపాటు ఆయన బంధువులు, కుటుంబీకుల సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సోదాల్లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి ..

తీగ లాగితే డొంక కదిలినట్టు సోదాల్లో మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. క్యాసినోలో పెట్టుబడులు పెట్టిన జైకిషన్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. జైకిషన్, మాధవరెడ్డి, చికోటి ప్రవీణ్ కలిసి క్యాసినోలో పెట్టుబడులు పెట్టినట్టు గుర్తించారు. గతంలోనూ జైకిషన్ ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. జైకిషన్ తండ్రి నరసింహ, మంత్రి మల్లారెడ్డి వ్యాపార భాగస్వాములు. సిఎంఆర్ స్కూల్స్‌లో నరసింహ యాదవ్, మల్లారెడ్డి పార్ట్‌నర్స్‌గా ఉన్నారు. దీంతో నరసింహయాదవ్, జైకిషన్ ఇళ్లల్లో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. 14 విద్యాసంస్థల ప్రధాన కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. కాలేజీల ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నారు. అయితే, మల్లారెడ్డి కాలేజీకి సంబంధించిన బ్యాంకు వ్యవహారాలన్నీ క్రాంతి బ్యాంక్ ద్వారానే నిర్వహించడం జరుగుతున్నట్టు గుర్తించారు.

బాలనగర్ రాజు కాలనీలో నివాసముంటున్న ఆ బ్యాంకు చైర్మెన్ రాజేశ్వరరావు ఇంట్లో ఐటీ సోదాలు జరుపుతున్నారు. అలాగే, కన్వీనర్ కోటా సీట్లను ప్రయివేటు వ్యక్తులకు భారీ మొత్తానికి అమ్మినట్టు తెలిసింది. నాలుగు మెడికల్ కాలేజీల లావాదేవీలను అధికారులు పరిశీలించారు. మల్లారెడ్డికి సన్నిహితంగా ఉంటున్న సంతోశ్ రెడ్డి ఇంట్లోనూ తనిఖీ చేశారు. ఆర్థిక వ్యవహారాల్లో వీరిద్దరూ సన్నిహితంగా ఉంటున్న విషయం తాజా సోదాల సందర్భంగా వెలుగులోకి వచ్చింది.

మంత్రి అల్లుడి ఇంట్లో ఎలక్ట్రానిక్ లాకర్

మంత్రి మల్లారెడ్డి నివాసంతోపాటు అల్లుడు రాజశేఖర్‌రెడ్డి ఇంట్లోనూ ఐటీ బృందాలు ఉదయం నుంచీ సోదాలు నిర్వహించాయి. అయితే, రాజశేఖర్‌రెడ్డి భార్యతో కలిసి ఆయన టర్కీ పర్యటనలో ఉన్నారు. ఇంట్లో ఎలక్ట్రానిక్ లాకర్ ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు. దీన్ని తెరవడానికి ఆయనతో సంప్రదింపులు జరుగుతున్నట్టు తెలిసింది.

ఉద్యోగావకాశాల్లో యువతకు సహకరిస్తాం

- సిఎస్ సోమేశ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర యువత ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా వారిని ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేషన్ (ఐఒఎం), ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ) ప్రతినిధులు సిఎస్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయంగా తిరిగొస్తున్న వలస జీవులకు అందించాల్సిన సహకారంపై చర్చించారు. సిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం టామ్ కామ్ను స్థాపించి నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్నదని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉత్తమ ఉద్యోగాలు మన యువతకు దక్కాలంటూ ఆకాంక్షించారు.

ఇందులో భాగంగా నర్సులకు ఇప్పటికే శిక్షణ మొదలు పెట్టామనీ, మిగిలిన రంగాల్లో కూడా శిక్షణనిచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. వలసలు పోయే పనివారల కోసం ప్రభుత్వం సుస్థిరమైన కార్యక్రమాలతో అనువైన వాతావరణం కల్పించిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఐఒఎం ప్రధాన కార్యాలయ అధిపతి సంజయ్ అవస్థి, ఐఎల్ఓ డైరెక్టర్ డగ్మర్ వాల్టర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్యా నాయక్ సేవలు చిరస్మరణీయం

- నవతెలంగాణ సిజిఎం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవ తెలంగాణ సంస్థకు రెడ్యానాయక్ అందించిన సేవలు చిరస్మరణీయమని నవ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ అన్నారు. రెండ్రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందిన నవతెలంగాణ సీనియర్ అకౌంటెంట్ రెడ్యానాయక్ సంస్మరణ సభ మంగళవారం నవ తెలంగాణ హెడ్ ఆఫీస్ (ఎం.హెచ్ భవన్)లో ప్రింటింగ్ జనరల్ మేనేజర్ రఘు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిజిఎం ప్రభాకర్, ఎడిటర్ సుధా భాస్కర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా సిజిఎం ప్రభాకర్ మాట్లాడుతూ.. 1996 నుంచి క్యాషియర్‌గా, సీనియర్ అకౌంటెంట్‌గా రెడ్యానాయక్ సంస్థలో పని చేశారని చెప్పారు. నవతెలంగాణ సంస్థ పట్ల ఆయన అంకిత భావంతో పనిచేసినట్టు కొనియాడారు. ప్రతి అంశం పట్ల జవాబుదారీగా వ్యవహరించేవారని తెలిపారు. ఎడిటర్ సుధా భాస్కర్ మాట్లాడుతూ.. దాదాపు 26 సంవత్సరాలపాటు సంస్థకు సేవలు అందించిన రెడ్యా నాయక్ అకాలమరణం నవతెలంగాణకు తీరని లోటన్నారు. ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సిబ్బందికి సూచించారు. రెడ్యా నాయక్ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆయన కుటుంబానికి తీరని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సిబ్బందీ మనకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ఆర్.వాసు, శశి, వెంకటేష్, నరేందర్ రెడ్డి, మేనేజర్లు ఉపేందర్, గురు దీప్, రేణుక, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు వేణు, సంస్థ ఉద్యోగులు పాల్గొని రెడ్యా నాయక్‌కు నివాళులర్పించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న నవతెలంగాణ సిజిఎం

ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలివ్వాలి

- ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్
- ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి ఇల్లు కట్టుకోవడం కోసం ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మండల ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి, ఇంటి స్థలం ఉన్న వారికి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎమ్మార్వో స్పందిస్తూ.. సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు, మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శి బంగారు నర్సింగరావు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కృపాసాగర్, ఐద్వా మండల కార్యదర్శి బి.మంగ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

వాటర్ ట్యాంక్ ఎక్కిన మహిళలు

కాంటిజెన్సీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

- వాటర్ ట్యాంక్ ఎక్కి వర్కర్ల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో పనిచేస్తున్న కాంటిజెన్సీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. దాంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వాటర్ ట్యాంక్ ఎక్కిన హాస్టల్ వర్కర్స్‌ను కిందికి దింపే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటలపాటు నిరసన తెలిపిన వర్కర్లు పోలీసుల సూచనలతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా డైలీ వర్కర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు సౌందర్య మాట్లాడుతూ.. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించే వరకు దశల వారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

కొంతమంది అధికారులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ తమ సమస్యలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి డైలీ వైజ్ వర్కర్లకు బేషరతుగా ఉద్యోగ భద్రత కల్పిస్తూ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ, గూడూరు, గంగారం మండలాల డైలీ వైజ్ వర్కర్లు పాల్గొన్నారు.

'సంక్షిప్తి' పాటతోనే సాధ్యం

- యుద్ధంలో ముందు సాంస్కృతికంగా జయించాలి
- కవి, అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి
- ముగిసిన తెలంగాణ సాహితీ లిటరరీ ఫెస్ట్-2022

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షిప్తి అనేది తెలివికి ఆత్మ లాంటిందనీ, సంక్షిప్తి అనేది పాటతోనే సాధ్యపడుతుందని ప్రముఖ కవి, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో లిటరరీ ఫెస్ట్-2022 మూడో రోజూ కొనసాగింది. మంగళవారం సాహితీ ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధనను శాలువా, మెమోంటోతోని సత్కరించారు. అనంతరం ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సాహిత్యంలో పాట శక్తివంతమైన రూపం అని చెప్పారు. పాటకు మొదటి రూపం జానపద గీతాలు అని తెలిపారు. పాట చరిత్ర వచన కవిత్వ చరిత్ర కంటే పెద్దదన్నారు. చైనా ఫిలాసఫర్ ఆర్ట్ ఆఫ్ వార్ పుస్తకంలో యుద్ధం చేయకుండానే యుద్ధంలో గెలవటం గొప్ప కళ అని చెప్పారన్నారు. యుద్ధంలోగానీ, ఉద్యమంలోగానీ శత్రువును జయించాలంటే మొదట సాంస్కృతికంగా జయించాలని నొక్కి చెప్పారు. అదే సమయంలో శత్రువును జయించడంలో పాట పాత్ర కూడా చాలా కీలకమని

చెబుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమంలో దాని పాత్రను వివరించారు. ఉద్యమాలు పురుడుపోసుకోవడానికీ, అవి విజయవంతం అవడానికీ పాట ఒక శక్తిగా దోహదపడుతుందన్నారు. సుప్రభాతం వినవిదే దేవుడు కూడా లేవని ఈ సమాజంలో మంచిని పదేపదే పాట రూపంలో ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్నారు. పాటను సాహిత్యరూపంగా పాత కాలం ధృవీకరించలేదన్నారు. ఆధునిక కాలంలో ప్రజలు చలనశీలురు అయి అనేక ఉద్యమాలు మొదలైనప్పుడు పాట ఒక శక్తిగా లేచిందన్నారు. మనిషి అంతరంగాన్ని తట్టిలేపే శక్తి పాటకుందని కొనియాడారు. గొప్ప పాటగాడు గొప్ప కవి అవుతాడనీ, అదే గొప్ప కవి గొప్ప పాటగాడు కాలేడని చెప్పారు. మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కవులు, రచయితలు ఎవ్వరికీ తల వంచకుండా ప్రజల మేలు కోసం, సమాజ మార్పు కోసం తమ రచనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అరసం అధ్యక్షులు రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ.. సామాజిక స్పృహతోనే రచనలు చేయాలని కోరారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, అన్నవరం దేవేందర్, షహనాజ్ బేగం, నిర్మల, కపిల రాంకుమార్, ఎస్.లింగమూర్తి, కాసుల రవికుమార్, మందా వెంకట్, కొండ రవీందర్, భానుచందర్, ఫెస్ట్ నిర్వాహకులు రాంపల్లి రమేశ్, శరత్‌సుదర్శి, సలీమా, ఎ.మోహన్‌కృష్ణ, శరత్‌చంద్ర, తెలంగాణ సాహితీ హైదరాబాద్ నగర కార్యదర్శి రేఖ పాల్గొన్నారు. ఉదయం సెషన్‌లో సినీ రచయిత గుండేటి రమేశ్ మాట్లాడుతూ.. తాను రాసిన చీర, దోతి పాటల గురించి చెబుతూ అందులోని చమత్కారాన్ని వివరించారు. మరో రచయిత రామి రెడ్డి మాట్లాడుతూ.. ఈ భూమ్మీద పాట లేని చోటే లేదన్నారు. సినీ గేయ రచయిత పింగళి చైతన్య మాట్లాడుతూ.. సినీ రంగంలో మహిళా రచయితలు చాలా తక్కువగా ఉన్నారనీ, అవకాశాలు కూడా అంతంత మాత్రమేనని చెప్పారు.

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పద్మ, జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభ ఈ నెల 20, 21 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో జరిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా 65 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా ఎం.పద్మ (సిద్దిపేట), ప్రధాన కార్యదర్శిగా పి.జయలక్ష్మి (రాష్ట్ర కేంద్రం), కోశాధికారిగా కె.సునీత (ఆదిలాబాద్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇ.వెంకటమ్మ (భద్రాద్రి కొత్తగూడెం), జి.జ్యోతి (పెద్దపల్లి), ఏమెలమ్మ (గద్వాల), జి.కవిత (రంగారెడ్డి), టి.పార్వతి (నాగర్ కర్నూల్), డి.సునీత (ఆదిలాబాద్), కోటేశ్వరి (ఖమ్మం), సహాయ కార్యదర్శులుగా జి.పద్మ (భద్రాద్రి కొత్తగూడెం), పి.మంగ (సంగారెడ్డి), కె.నర్సమ్మ (మెదక్), స్వర్ణ (నిజామాబాద్), బి.స్వప్న (యాదాద్రి భువనగిరి), శారద (వనపర్తి), త్రివేణి (కొమురం భీం) ఎన్నికయ్యారు.

సమగ్ర సాహిత్య చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర' ప్రజలకు కరదీపిక

- పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - కల్చరల్

'తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర' అన్ని రంగాల ప్రజలకు రాష్ట్రంపై అవగాహన కలిగించే కర దీపిక అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రవీంద్రభారతిలోని తన కార్యాలయంలో మంగళవారం సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌తో కలిసి తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 715 పేజీల ఈ గ్రంథాన్ని అకాడమీ కృషితో అందుబాటులోకి తెచ్చారని అభినందించారు. గొప్ప పరిశోధనాత్మక గ్రంథమని, ప్రతి విద్యార్థి ఇంటిలో ఉంచుకినాల్సిన అవసరముందని పేర్కొన్నారు. జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ.. ఈ గ్రంథంలో 50 మంది ప్రముఖ రచయితలు, తెలంగాణ పూర్వ పాలకుల నుంచి మలి దశ తెలంగాణ ఉద్యమం వరకూ నిక్షిప్తం చేశారని తెలిపారు. గత పాలకులు తెలంగాణ సాహిత్యాన్ని, కవులను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాహిత్య ఆకాడమీ కార్యదర్శి డాక్టర్ మామిడి హరికృష్ణ, అధికారుల సంఘం నాయకులు మామిళ్ల చంద్రశేఖర్, కవి కోట్ల వెంకటేశ్వర రెడ్డి, విమర్శకుడు కెపి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఓవర్సీస్ స్కాలర్ షిపులు

- ఎనిమిదేళ్లలో 4,919 మంది విద్యార్థులు లబ్ది
- ఉపకార వేతనాలతో పేద విద్యార్థులకు ప్రభుత్వం ఆసరా
- ప్రఖ్యాత యూనివర్సిటీల్లో విద్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకాన్ని అమలు చేస్తోంది. తెలంగాణ ఏర్పడక ముందు ఎస్‌సి, ఎస్‌టిలకు మాత్రమే ఈ పథకం అమలయ్యేది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక బిసి, ఇబిసి, మైనారిటీలకూ అమలు చేస్తున్నారు. అగ్రవర్ణ కులాలకు చెందిన పేద విద్యార్థులకూ ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపచేసింది. గతంలో కేవలం రూ.పది లక్షల గరిష్ట పరిమితి ఉండేది. ఇప్పుడు ఈ పథకం కింద రూ. 20 లక్షల వరకు అందిస్తున్నారు. ఆదాయ పరిమితినీ రూ.నాలుగు లక్షల 50 వేలకు పెంచారు. పది శాతం ఓవర్సీస్ స్కాలర్‌షిపులు హ్యూమానిటీస్, ఎకనామిక్స్, అకౌంట్స్, ఆర్ట్స్ విద్యార్థులకు రిజర్వ్ చేశారు. ఎనిమిదేళ్లలో 4,919 మంది విద్యార్థులు లబ్దిపొందగా.. వీరి కోసం ప్రభుత్వం రూ.885.99 కోట్లు ఖర్చు చేసింది. లబ్ది పొందిన విద్యార్థుల్లో ఎస్‌సి క్యాటగిరిలో 935 మంది, ఎస్‌టి 208, బిసిలు 1,603, మైనార్టీ విద్యార్థులు 2,173 మంది ఉన్నారు. ఈ ఉపకార వేతనంతో పేద విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా తదితర దేశాల్లోని ప్రఖ్యాత యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డి చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఇలాంటి పథకమే ఉన్నా.. వంద మందిలోపే విద్యార్థులు ఎంపికయ్యేవారు. స్కాలర్‌షిప్ రూ.ఐదు లక్షలైనా ఉండేది కాదు. ఇప్పుడు రూ.20 లక్షలు కేటాయిస్తున్నారని పౌరసంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఎఫ్ఆర్‌ఒపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- అధికారులకు రక్షణ కల్పించేలా సిఎంతో చర్చిస్తాం
- టిజిఒ చైర్మెన్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామం ఎర్రబోదులో ప్లాంటేషన్ మొక్కలను నరుకుతుంటే అడ్డుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఒ) శ్రీనివాసరావుపై గుత్తికోయలు కత్తులతో దాడి చేయడాన్ని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టిజిఒ) సంఘం చైర్మెన్, వ్యవస్థాపక అధ్యక్షులు, మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ ఖండించారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. హైదరాబాద్‌లో టిజిఒ సంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ అమానుష చర్యపై విచారం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు మున్ముందు జరగకుండా సిఎం కెసిఆర్‌తో చర్చించి అధికారులకు తగిన రక్షణ కల్పించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. టిజిఒ అధ్యక్షురాలు వి మమత, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, అధికారులపై ఇలాంటి దాడులు జరిగితే వారి ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు మరణం దురదృష్టకరమనీ, సంతాపం తెలియజేస్తున్నామనీ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, జీవితకాలం జీతభత్యాలు ప్రకటించి ఈ అమానుష దాడికి పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ సిఎం కెసిఆర్ ఆదేశించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఒ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి కృష్ణాయాదవ్, నగర శాఖ అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అటవీ శాఖ అధికారులు రాజారమణారెడ్డి, జోజో, విజయనందరావు, లావణ్య, గోపి, చంద్రశేఖర్‌గౌడ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.